# పరిష్కారం



కథా నిలయం
6140
శ్రీకాకుళం

'చుక్కాని' పత్రిక . . . 15 జనవరి, 1962

"డాక్టరుగారూ! అమ్మాయికి ఏమీ ఫర్వాలేదంటారా?"

– అని ఆతృతతో అడిగారు శాస్త్రిగారు... అప్పుడే కాంతాన్ని పరీక్ష చేసి వస్తున్న లేడీడాక్టర్ కమలని.

"ఏమీ ఫర్వాలేదండీ! కాకపోతే కాన్పు కొంచెం కష్టమవవచ్చు. అంతకుమించి మరేమీ భయం లేదు. రాత్రికి కానీ పురుడు రాదు" అంది లేడీడాక్టర్ కమల.

"ఏమోఁ... భారమంతా మీమీదే వదిలిపెట్టాం!" అంది శాంతమ్మగారు గాద్గదికంగా– కళ్ళనీళ్లు చెంగుతో వత్తుకుంటూ.

"డాక్టరమ్మగారు ఉండగా మీకెందుకమ్మా భయం?!" అంటూ వెనకాలే వచ్చింది మంత్రసాని రత్తమ్మ బ్యాగ్ చేత్తో పుచ్చుకొని.

కాంతం– శాస్త్రి, శాంతమ్మగార్ల ఏకైక పుత్రిక. ఆమెను అల్లారుముద్దుగా పెంచారు వారు. ఆమె కాక ఆ దంపతులకు 'రామం' అనే పాతికేళ్ల పెద్దకొడుకు, 'విశ్వం' అనే ఆరేళ్ల చిన్నకొడుకు ఉన్నారు. మధ్య పోయినవారు పోగా... శాస్త్రిగారు ప్రస్తుతం ఒకమాదిరి స్థితిపరుడు.

సనాతనాచారాల మీద గౌరవం ఉన్నా, ఆధునిక పరిస్థితుల పట్ల వైముఖ్యం లేక, పరిస్థితులకు అనుగుణంగా పోతుంటాడు. శుద్ధస్తోత్రియ వాతావరణంలో పెరిగిన శాంతమ్మగారు మాత్రం ఛాందసురాలుగా అనిపిస్తుంటుంది. కాళ్లకు ఇనుప గొలుసుల్లాంటి వెండిపట్టాలు, మెళ్లో కంటె, కాసుల పేరు, ముక్కుకు నత్తు, పసుపు పూసిన ముఖానికి అర్ధణా కాసంత కుంకుమ... ఇవన్నీ.

'ఇంకా ఈ కాలంలో కూడా ఇలాటి పూర్వకాలపు వారు ఉన్నారా?' అని అనిపింపజేస్తూ ఉంటాయి. పెద్దకొడుకు రామానికి ఏడాది క్రితమే పెళ్ళి అయింది రాధతో. పెళ్ళయిన వేళావిశేషమేమో... ఉన్న ఊళ్లోనే గవర్నమెంటు ఉద్యోగం దొరికింది. కొద్దినెలల క్రితమే రాధ కాపురానికి కూడా వచ్చింది.

పదహారవ ఏటనే కాంతానికి పెళ్ళి చేశారు.

శాంతమ్మగారికి మాత్రం పిల్లకి పెద్దమనిషి కాకుండా పెళ్ళిచేయాలని, పెద్దమనిషి కాని కోడల్ని తెచ్చుకోవాలనీ పట్టుదల ఉండేది కాని, ప్రస్తుత కాలపరిస్థితులు అనుకూలించలేదు.

కాపురానికి వెళ్లిన ఏణ్ణర్థానికే కాంతం గర్భవతి అయింది.

ఆరో నెలకే పుట్టింటికి తీసుకువచ్చారు ఆమెను.

వేడుకలన్నీ వైభవంగా జరిగాయి. ఆమె అందరికీ తలలో నాలుకలాగా ఉండేది. ఇంటాబయటా కూడా అందరూ ఆమె అంటే ఆపేక్షగా ఉండేవారు.

సాయంత్రం శాస్త్రిగారు వీధిలోకి వచ్చి అరుగుమీద కూర్చున్నారు.

"ఏమే వెంకాయి... ఇలా వచ్చావు? వంట్లో బాగుంటోందా?" అని ప్రశ్నించారు శాస్త్రిగారు- అప్పుడే వచ్చి దణ్ణం పెట్టిన వారి పనిమనిషిని చూసి.

"తమరి దయవల్ల బాగానే ఉండాను బాబూ!" అంది తలవంచుకొని, కాలి బొటనవ్రేలుతో నేలగీరుతూ- వెంకాయి.

"ఎవరూ... వెంకాయా... ఓసినీ అసాధ్యం కూలా... నడికట్టైనా విప్పకుండా పచ్చిబాలింతవు ఇలా వచ్చావేమే?" అంటూ లోపల్నుంచి వీధిలోకి వచ్చింది శాంతమ్మగారు.

"ఏం చేయమంటారు అమ్మగోరూ! ఎన్నాళ్లు ఏడిస్తే మాత్రం పోయిన బిడ్డడు వస్తాడా..? పనిలోకి రాకుండా ఒంటిగా ఉంటేనే మరీ గుబులుగా ఉంటోంది అమ్మగోరూ! నా ఖర్మ... బెమ్మదేవుడు నా ముకాన్న ఇంతే రాశాడు. ఇందాక రత్తమ్మ కనబడి చెప్పింది- చిన్నమ్మగారికి నొప్పులొస్తున్నాయని! నా మనస్సు ఉండబట్టక వచ్చేశాను అమ్మగోరూ! ఈయాల నుంచే పనిలోకి మళ్లీ వచ్చేస్తాను అమ్మగోరూ... మోటోళ్ళం... మాకేంటి?" అంది- గాద్గదికంగా బాధను అణచుకుంటూ, వైరాగ్యం తెచ్చుకుంటూ.

"మంచిదానవే! సర్లే రా... నీ అవసరం ఎంతైనా ఉందిప్పుడు!" అంది శాంతమ్మగారు.

పన్నెండేళ్ల నుంచీ వెంకాయి ఆ ఇంట్లో పనిమనిషిగా ఉంటోంది. ఆమె మనస్సు మంచిది. చెప్పిన పని ఎంతో ఓర్పుతో చేస్తుంది. ఎవరికి ఏ కష్టం వచ్చినా తనకు వచ్చినట్లే బాధపడుతుంది. కాంతాన్ని చిన్నతనం నుంచి ఆడించి పెంచింది. అందుచేత కాంతం అంటే ఆమెకు అమితమైన ఆపేక్ష! ఆ ఇంట్లో అందరికీ కూడా ఆమె అంటే అభిమానం ఉంది. అందులో కాంతానికి మరీను. పేరుకు పనిమనిషి అయినా ఇంట్లోమనిషి మల్లేనే ఉండేది. అదేమి దురదృష్టమో ఆమెకు ఆరుగురు పిల్లలు పుట్టినా ఒక్కరూ బ్రతకలేదు. ఇరవై రోజుల క్రితం ఒక మగప్లివాడు పుట్టి, మూడురోజులు కాకుండా పోయాడు. ఆమెకు పుత్రశోకం భరించరానిదైనా, తగిలిన వ్రేలికే దెబ్బ తగులుతూ ఉండడంవల్ల అప్రయత్నంగా వైరాగ్యం అలవడింది. ఆమెలో మాతృత్వం మోడువారి పోయింది.

శీతాకాలం ప్రొద్దేమో... సాయంత్రం ఆరింటికే చీకటి పడిపోయింది.

చల్లని ఈదురుగాలి వళ్ళు వణికిస్తోంది. ఆ సాయంత్రం ఆరు గంటలకల్లా మంత్రసాని రత్తమ్మ వచ్చేసింది. డాక్టరమ్మగారు భోజనం చేసి ఎనిమిది గంటలకు వచ్చింది. ఇంట్లో అందరూ హడావుడిగా ఉన్నారు. శాస్త్రిగారు సావిట్లోనించి వీధిలోకి, వీధిలోనుంచి సావిట్లోకి ఆదుర్దాగా తిరుగుతున్నారు.

అంతకంతకూ ఎక్కువగా గదిలోంచి వస్తున్న ఆ నెప్పులను వింటుంటే ఆయన మతిపోతోంది. పాపం... శాంతమ్మగారు సరేసరి! ఏ మాట మాట్లాడినా ముందు ఆవిడకు ఏడుపే వస్తోంది. చీటికిమాటికి గదిలోంచి ఇంట్లోకీ, ఇంట్లోంచి గదిలోకీ వెళ్తోంది, వస్తోంది. తడవతడవకీ రత్తమ్మనీ, డాక్టరమ్మనీ అమ్మాయిని గురించి కుశలప్రశ్నలు అడుగుతూనే ఉంది.

వంటపని కోడలు రాధ చూస్తోంది. ఆమె కూడా మధ్యమధ్య ఒకసారి గది గుమ్మంలోకి వచ్చి లోనికి తొంగిచూసి పోతోంది.

వెంకాయి వేడినీళ్లు పెడ్తోంది. ఆమె కంగారు అంతాఇంతా కాదు. కాలుగాలిన పిల్లికి మల్లే ఇల్లంతా, దొడ్డి అంతా తిరుగుతోంది. చీటికిమాటికీ గది దగ్గరకు వచ్చి చూసిపోతోంది. రామం తన దగ్గరకు వచ్చి చూసిపోతోంది.

రామం తన గదిలో ఒంటరిగా చీకటిలో కూర్చున్నాడు పరధ్యాసగా. చీకటి పడినా లైటు వేసుకోవాలని కూడా అనిపించలేదు అతనికి. విశ్వం ఆడుకుంటూ వచ్చి ఆ విషయం జ్ఞాపకం చేసేవరకూ అతనికి ఆ విషయం తెలియనే తెలియదు. ఆ ఇంట్లో ఏ విధమైన కంగారూ లేకుండా నిశ్చింతగా తిరుగుతోందీ, ఆడుకొంటోందీ... ఆ ఆరేళ్ల పసివాడొక్కడే! వాడు అందర్నీ ప్రశ్నలతో ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాడు.

రాత్రి తొమ్మిది గంటలు అయింది!

ఈదురుగాలి జోరు హెచ్చుతోంది. కిటికీలోంచి బయటకు చూసిన రామానికి- నక్షత్రాలు ఏమీ కనిపించలేదు. అంతా చిమ్మచీకటిగా ఉంది. ఆకాశం మేఘావృతమై ఉంది. సన్నటి తుంపర పడుతోంది. కిటికీ తలుపులు వేసి, ఏమీ తోచక రేడియో పెట్టాడు రామం. ఆ సమయానికి వార్తలు అయిపోయి వాతావరణ వివరాలు వస్తున్నాయి. మద్రాసుకు 800 మైళ్లు ఈశాన్యంగా ఏర్పడిన వాయుగుండం మూలంగా సర్కారు జిల్లాల్లో ముఖ్యంగా కోస్తా ప్రాంతాలలో ఉరుములతో కూడిన గాలివానలు రానున్న ఇరవై నాలుగు గంటలలో పడవచ్చునని వార్త!

'అబ్బే... ఏమీ బాగా లేదు' అనుకొని రేడియో ఆపేసి, సావిట్లోకి వచ్చాడు రామం.

రాత్రి పదకొండు గంటలయింది!

బయట గాలిజోరు అంతకంతకూ హెచ్చుతోంది. నల్లటి ఆకాశం ఉండుండి మెరుపులతో ప్రకాశిస్తోంది. గదిలోంచి నెప్పులు అంతకంతకూ ఎక్కువగా వినిపిస్తున్నాయి. ఇంటిలోని అందరి ఆతృత అతిశయిస్తోంది. బయట వర్షం జోరుగా కురుస్తోంది.

ఉన్నట్లుండి పెద్దమెరుపు మెరిసింది!

ఇంతలో... గదిలో నుంచి శిశురోదన వినిపించింది. నొప్పుల సవ్వడి ఆగిపోయింది. అందరూ గది బయటనే ఉన్నారు. ఒక్క విశ్వం మాత్రం లోపల నిద్రపోతున్నాడు.

కొంచెంసేపైన తర్వాత రత్తమ్మ గది తలుపులు తీసి, తల రెండు తలుపుల మధ్యపెట్టి, నవ్వు ముఖంతో, “మగపిల్లవాడు అమ్మా... బంగారం వంటి బిడ్డ!” అంది.

అందరి ముఖానా ఒక్కసారి ఆనందం వెల్లివిరిసింది. అందరికీ కొండంత బరువు తగ్గినట్లనిపించింది.

శాంతమ్మగారు వెంటనే “నీ చేతిచలవ రత్తమ్మా! అమ్మాయి కులాసాగా ఉంది కదా?” అంది ఆదుర్దాగా.

“కంగారేమీ లేదమ్మా!” అంటూ తల మళ్లీ లోనికి పోనిచ్చి, తలుపులు వేసేసింది రత్తమ్మ.

“ఏమో... నీ ఋణం తీర్చుకోలేను!” అంటూ తలవంచుకునే కళ్ళు వత్తుకుంది శాంతమ్మ గారు.

అరగంట గడిచింది... ముప్పావు గంట గడిచింది...

అయినా గది తలుపులు ఇంకా తెరువబడలేదు. పసిపిల్లవాడు ఎలావున్నాడో చూడాలనే కోరికతో నిండిన తహతహ అందరిలోనూ కన్పిస్తోంది.

శాంతమ్మగారు విశ్వం ఏం చేస్తున్నాడో చూద్దామని లోనికి వెళ్లింది. బయట గాలీ, వాన మళ్లీ ఒక్కసారి ఎక్కువయ్యాయి. శాంతమ్మగారు విశ్వానికి దుప్పటి కప్పుతుండగా- బయట ఆకాశం పగిలిందేమో అన్నట్లు బ్రహ్మాండమైన పిడుగు పడింది.

“అమ్మా...” అంటూ భయంతో విశ్వం లేచి తల్లిని కౌగిలించుకున్నాడు. గదిలోంచి పసిపిల్లవాడి ఏడుపు ఒక్కసారి గట్టిగా వినిపించింది.

గది తలుపులు ఒక్కసారి తెరుచుకొన్నాయి. పాలిపోయిన ముఖాలతో రత్తమ్మా, డాక్టరమ్మా బయటకు వచ్చారు. రత్తమ్మ “అమ్మాయి అమ్మా...” అంటూ ఏడవడం మొదలుపెట్టింది.

"ఏమైందీ?" అంటూ పరిగెత్తుకు వచ్చింది శాంతమ్మగారు విశ్వాన్ని ఎత్తుకునే.

"ఏం చెప్పనమ్మా... కాంతమ్మగారు ఇంక లేరు. పిల్లవాడు మాత్రం కులాసాగా ఉన్నాడు" అంది వలవలా ఏడుస్తూ.

"డాక్టరుగారూ... నిజమేనా?" అంటూ కూలబడిపోయారు శాస్త్రిగారు.

"అమ్మాయీ..." అంటూ ఏడుస్తూ గదిలోనికి పరిగెత్తింది శాంతమ్మగారు.

"పిల్లవాడు చాలా పెద్దగా పుట్టాడు. అందుచేత కాన్పు కష్టమయ్యింది. నేను చేయగలిగినదంతా చేశాను... ఎంతకీ ఫలితం దక్కలేదు" అంది డాక్టర్ కమల నెమ్మదిగా తలవంచుకొని.

"కాంతం..!" అంటూ లోనికి పరిగెత్తారు శాస్త్రిగారు.

"చిన్నమ్మగోరూ..." అంటూ వెంకాయి గొల్లుమంది.

అందరూ శాస్త్రిగారి వెనకాలే గదిలోకి వెళ్లారు.

క్షణంలో రోదనలతో గది నిండిపోయింది. ఆ రోదనలలో ఆ పసివాడి ఆక్రందన అరణ్యరోదనమే అయ్యింది.

చివరికి వెంకాయి దుఃఖం ఆపుకొని, ఆ శిశువుని తీసుకొని బయటకు వచ్చింది. నిర్విరామంగా ఏడ్చే ఆ శిశువుని చూస్తే, ఆమెలోని అణగారిపోయిన మాతృత్వం విజృంభించింది. ఆ శిశువుని ఆప్యాయంగా హృదయానికి హత్తుకుంది. ఆ పసిగుడ్డుని తన బిడ్డడుగానే భావించింది. ఆ క్షణంలో అప్రయత్నంగా ఆ పసివానికి స్తన్యం అర్పించింది.

బయట గాలివానల జోరు తగ్గింది.

శిశురోదన ఆగింది. ఆమె హృదయం అవ్యక్తానందం అనుభవించింది. తల్లి అంటే ఏమో ఎరుగని ఆ పసికూనకి ఆ క్షణంలో తల్లిలేని లోటు తీరింది.

కాంతం పోయిన మర్నాడు- ఆమె భర్త రమణమూర్తి, అతని తల్లీ తండ్రీ వచ్చారు. జరగవలసినవన్నీ జరిగిపోయాయి. పుట్టుకతోనే తల్లిని మింగిన ఆ పిల్లవానిని పెంచడం తమ తరం కాదని రమణమూర్తి, అతని తల్లిదండ్రులూ వెళ్లిపోయారు. సంస్కారం లేని ఆ అల్లుడు నెల తిరక్కుండా మళ్లీ పెళ్ళి చేసుకొన్నాడు.

చూస్తుండగానే మూడు నెలలు ఇట్టే గడిచిపోయాయి...

కాగా... జన్మతః దురదృష్టవంతుడైన ఆ పసివానిని సాకడం ఒక పెద్దసమస్య అయ్యింది.

శాంతమ్మగారు వస్తుతః ఎంతమంచిదైనా, మూఢనమ్మకాల మధ్య పెరిగిన ఆమెకి- ఆ పిల్లవాడు దుష్టనక్షత్రంలో పుట్టాడనీ, తల్లిని మ్రింగివేశాడనీ భావించి ఆ పసివాడిపై నిరాదరణ పూనింది. ఎప్పుడైనా పిల్లవాడు ఏడుస్తుంటే- ఆమెలో స్వతహాగా ఉన్న ఆపేక్ష చొప్పున వెళ్లి ఎత్తుకొన్నా, వాడి ముఖం చూసేసరికి- చనిపోయిన కుమార్తె జ్ఞాపకానికి వచ్చేది. వెంటనే అలవర్చుకొన్న ద్వేషం ప్రేమను జయించి, "ఛీ..ఛీ... దిక్కుమాలిన పిల్లవాడు- తల్లిని చంపింది చాలక, ఇంకా ఎవరిని చంపాలనో ఈ ఏడుపు?" అని ఛీదరించుకొని దింపేసి వెళ్లిపోయేది.

ఇంక పిల్లవాని బాధ్యత రాధ భుజాలపై పడింది. పద్దెనిమిది ఏళ్లైనా నిండని ఆమెకు అనుభవం లేని ఈ బాధ్యత కష్టమనిపించింది. కారణద్వేషం అలవరచుకొన్న అత్తగారు- అవసరానికి సలహా కూడా సరిగ్గా చెప్పేది కాదు.

తల్లిపాలకి నోచుకోని ఆ పిల్లవానికి గోవుపాలే శరణ్యమయ్యాయి. అవి ఏ విధంగా, ఎప్పుడు ఇయ్యాలో తెలియని రాధ తనకు తోచినట్లు చేసేది. ఫలితంగా పిల్లవాడి ఆరోగ్యం తరచూ చెడుతుండేది. నిత్యమూ ఏడుస్తూ ఉండేవాడు. ఆ అరణ్యరోదనం- 'తల్లిలేని తాను ఎందుకు బ్రతికానా..?' అన్నట్లుండేది. మిగిలినవారికి అది 'ఈ శాపమేమిటి బాబూ...' అనిపించేది.

ఇటువంటి పరిస్థితులలో ఆ పిల్లవాడు మూడునెలల బట్టీ బ్రతికే ఉన్నాడంటే ఆశ్చర్యమే! నిజానికి ఆ ఇంట్లో ఇతరులకు తెలియని ఒక శక్తి ఆ అభాగ్యుణ్ణి రక్షిస్తోంది. అది... ఆ ఇంటి పనిమనిషి వెంకాయిలో దాగివున్న మాతృత్వం! ఇంట్లో పనిచేస్తున్న కాలంలో వీలుచూసుకొని, ఏదో ఒక పని కల్పించుకొని వచ్చి పిల్లవానిని ఎత్తుకుంటూ ఉండేది. ఆకలికి ఆ పసివాడు ఏడుస్తూవుంటే ఎవ్వరూ చూడకుండా తాను పాలిచ్చేది.

ఉచ్చకులంలో జన్మించిన ఆ పసివానికి- నీచకులంలో జన్మించిన తాను పాలివ్వడం పాపమేమో అని భావించేది. క్షణకాలం భయపడేది. కానీ, ఆమెలో అణగారివున్న మాతృత్వం ఆ క్షణంలో విజృంభించేది. భయసందేహాలను పారద్రోలేది. భగవంతుడు తనకు ఇచ్చిన ఈ తల్లిలేని బిడ్డను- తను తల్లియై కాపాడటం, తన విద్యుక్తధర్మంగా భావించేది. అందులోనూ ఆ బిడ్డ తనకు ప్రీతిపాత్రమైన కాంతం బిడ్డ! ఆ సమయంలో ఆమె మాతృత్వం మేరు సమానంగా ధైర్యంతో నిలబడేది.

'ఏమైనా సరే... ఈ బిడ్డ నా బిడ్డ! వీడిని కాపాడవలసిన బాధ్యత నాది!' అనుకుంటూ ఆ పసిబిడ్డణ్ని హృదయానికి హత్తుకునేది. తల్లిలేని ఆ బిడ్డను ఆమె తల్లియై, బిడ్డలేని

ఆమెకు ఆ పసికందు బిడ్డయై, ఒకరి లోటును మరొకరు తీర్చుకుంటూ ఆ క్షణంలో అవ్యక్తానందం అనుభవించేవారు. వెంకాయికి ఇంటికి వెళ్లినా ఆ బిడ్డ మీదనే ప్రాణాలు ఉండేవి.

ఈ విధంగా మరొక రెండునెలలు గడిచిపోయాయి.

అసలే వేదాంతం రక్తంలో జీర్ణించుకున్న శాస్త్రిగారు- కాంతం పోవడంతో మరీ వైరాగ్యంలో పడ్డారు. ఆయనకు ఇంట్లో ఏమి జరుగుతోందీ, పిల్లవాడి గతి ఏమైందీ పట్టేది కాదు. పిల్లవాడి సమస్యతో శాంతమ్మగారికి కాలంతో పాటు శాంతం కూడా ఖర్చయిపోతోంది. చీటికిమాటికీ ఆరోగ్యం చెడి, ఆ పిల్లవాడు చెవిలో జోరీగ లాగా ఏడుస్తుంటే... ఆవిడకి వాడంటే అసహ్యం, ద్వేషం పెంపొందేవి. దాంతో 'ఏడిస్తే ఏడిచాడు. ఏడిచేడిచి వాడే ఊరుకుంటాడు. ఈ అష్టదరిద్రుడు పుట్టకపోయినా బాగుణ్ణు... నా బంగారుతల్లి బ్రతికే ఉండేది!' అని తనలో తనే విసుక్కునేది.

ఇంక నవయవ్వనంలో ఉన్న రామం, రాధల మధ్య ఈ పిల్లవాడు అగాధంలా తయారయ్యాడు. రాధకి ఈ బాధ్యత తప్పనిసరి తద్దినం అయ్యింది.

ఆఫీసు నుంచి అలసిపోయి వచ్చిన రామం- కులాసాగా తన ప్రియభార్యతో హాయిగా కాస్సేపు మాట్లాడుకుందామనుకొన్నా, వాడు తన కొంపేదో మునిగిపోయినట్లు గోల పెట్టేవాడు. శాంతమ్మగారు తాను కూర్చున్న చోటు నుంచి లేవకపోయినా- "పిల్లవాడు అట్లా కక్కటిల్లిపోతుంటే ఏమిటే మొగుడితో ఆ కబుర్లు? ఎప్పుడూ ఉన్నమాటలేగా... కొత్తేముంది? వెళ్లి వాణ్ణి ఎత్తుకో! ఏం కావాలో చూడు!" అని కేక వేసేది.

అత్తగారి అహంతో- పంచమ శృతిలో కోకిల పాడుతుంటే అపశృతి లాగా, ఆమందానంతో కబుర్లు చెప్పుకొంటున్న ఆ దంపతుల మధ్య కాకికూత లాగా వినిపించేది ఆ కేక. "వస్తున్నానత్తయ్యా..." అని బిగ్గరగా అరచి, "మాయ సంత... నా ప్రాణానికి వచ్చింది!' అని తనలో సణుగుకుంటూ వెళ్లిపోయేది రాధ. నిరుత్సాహంతో కూలబడి పోయేవాడు రామం.

ఇంట్లో సంగతే ఇలావుంటే- ఎప్పుడైనా ముచ్చటకి, అలా షికారుగా తిరించేదెలాగో ఆ దంపతులకు అర్థంకాలేదు. వెంకాయి పరిస్థితులు అన్నీ చూస్తూ ఏమీ చేయలేక, పైకి ఏమీ అనలేక లోలోపలే కుమిలిపోయేది.

ఆరోజు రాధ- ప్రక్కవీధి సుబ్బమ్మగారి కోడలికి సూడిదలు ఇస్తున్నారంటే పేరంటానికి వెళ్లింది. వెళ్తుంటే కాంతమ్మగారు- "పిల్లవాణ్ణి కూడా నీతో తీసుకొనివెళ్లవే!

ముసలిదాన్ని నేను వాడితో వేగలేను. ఈ పూటకి వంటపని నేను చూసుకుంటాను" అంది. అయిష్టంగా "సరే..." అని పిల్లవాణ్ణి కూడా తీసుకునివెళ్ళింది రాధ.

అక్కడ సుబ్బమ్మగారి కోడలు చేత రాధకు పళ్ళూ, తాంబూలం ఇప్పించారు. పార్వతీదేవి లాంటి పండు ముత్తయిదువ "వచ్చే ఏటికి నీవు కూడా ఇట్లాగే పళ్ళూ, తాంబూలం ఇయ్యాలి!" అని దీవిస్తుంటే- వెనకనుంచి ఎవరో అమ్మలక్క "ఆమె కెందుకే అమ్మా... ఆడబడుచు బిడ్డతోనే అతలాకుతలం అయిపోతుంటే ఇంకా సొంతబిడ్డ లెందుకు?" అని ఎత్తిపొడిచింది. ప్రక్కనున్న అమ్మలక్కలు కిలకిలా నవ్వారు. మరొక అమ్మలక్క "స్వంతబిడ్డ పుడితే ఆడబడుచు బిడ్డను అసలు చూస్తుందిటమ్మా?!" అని అంది సన్నగా. ఇంక అక్కడ ఉండలేక తీసుకొన్న తాంబూలం అక్కడే వదిలిపెట్టి, దుఃఖాన్ని దిగమ్రింగుకుంటూ ఇంటికి వెళ్ళిపోయింది రాధ.

విసవిసా నడిచి వచ్చి, పిల్లవాణ్ణి ఉయ్యాలలో పడేసి, మంచం మీద ఏడుస్తూ కూర్చుంది రాధ. అప్పుడే ఆఫీసు నుంచి వచ్చిన రామం- "ఎందుకు రాధా ఏడుస్తున్నావు? ఏం జరిగింది?" అని ఆతృతతో అడిగాడు.

రాధ ఏడుస్తూనే "ఎందుకులెండి, ఏం జరిగితే ఏం? ఆర్చేవారా, తీర్చేవారా?" అంది వెక్కుతూ.

"ఏం జరిగిందో చెప్పకపోతే ఎవరు మాత్రం ఏం చేయగలరు రాధా!" అని తల నిమురుతూ అడిగాడు రామం.

"అదిసరే గాని- ఈ విషయం చెప్పండి! బాబు తండ్రి బ్రతికేవున్నాడు కదా... పెళ్ళి కూడా మళ్లీ చేసుకుని కులుకుతున్నాడు కదా? అటువంటప్పుడు నాకు ఎందుకండీ ఈ తగలాటం? పిల్లవాణ్ణి అక్కడ వదిలేసి రాకూడదూ? అభం శుభం ఎరుగని నాకా ఈ చిత్రవధ?! నలుగురూ మాట్లాడే మాటలు వింటూంటే నా వళ్ళు గుల్లయిపోతోంది. పోనీ- ఆ ముసలావిడ అయినా మనవణ్ణి చూసుకుంటూ 'కృష్ణా, రామా' అనుకుంటూ కూర్చోకూడదూ? ఆవిడ మాత్రం పునిస్తరాకులాగా వెలేసేనా ముట్టను కూడా ముట్టదు గాని, ఇరవై నాలుగ్గంటలూ నేనా చాకిరీ చేయడం వీడికి? ఎవరికీ అక్కరలేని బిడ్డ నాకెందుకండీ?" అని గొల్లుమంది.

అప్పుడే పని పూర్తిచేసుకుని, ఇంటికి పోదామని వస్తున్న వెంకాయి వాళ్ళ మాటలు వినబడి గది బయటనే నిలబడిపోయింది. రాధ భర్తతో పేరంటం దగ్గర జరిగిన సంగతి చెబుతోంది. రామం ఆమెను ఓదారుస్తున్నాడు. వారి మాటలు వింటుంటే వెంకాయి

మనస్సు పరిపరి విధాల పోతోంది. రాధ మాటలు ఆమె చెవులకి శూలాల్లాగా తగిలాయి. ఏమి చేయడానికీ తోచడం లేదు. ఈ సమస్య ఎలా పరిష్కారం అవుతుందో అసలే అర్థంకావడం లేదు. ఇంతలో... పిల్లవాడు ఏడుపు మొదలుపెట్టడంతో ఆమె ఆలోచనలకి అంతరాయం కలిగింది.

పిల్లవాడిని ఎత్తుకుందామని రెండు అడుగులు ముందుకువేసింది. కాని, గదిలో దంపతులు మాట్లాడుకుంటూ ఉండగా లోనికి వెళ్లడం మర్యాద కాదని ఊరుకొంది. దంపతులు వారి గోలలో వారు ఉన్నారే కాని, పిల్లవాడి గోల పట్టించుకోనేలేదు. పిల్లవాడి ఏడుపు అంతకంతకీ ఎక్కువయిపోతోంది.

వెంకాయి హృదయం పంజరంలో చిలకలా కొట్టుకుంటోంది. ఎలాగయితేనేం- వాడి ఏడుపు ఆ దంపతుల సంభాషణకి అంతరాయం కలగజేయగలిగింది.

ఫలితం... అసలే ఉక్రోషంతో ఉడికిపోతున్న రాధ విసవిసా నడిచి ఉయ్యాల దగ్గరకు వచ్చి, "ఏడవరా... ఏడు! చచ్చేదాకా ఏడు! నీ ఏడుపుతో నా ప్రాణాలు తోడేస్తున్నావు. చావనైనా చచ్చావు కాదు!" అంటూ రెండు దెబ్బలు వేసింది గట్టిగా.

అసలే ఏడుస్తున్న ఆ అర్భకుడు- ఆ దెబ్బతో ఉక్కిరిబిక్కిరి అయి గ్రుక్కపట్టాడు.

దెబ్బ చప్పుడు వినేసరికి వెంకాయి హృదయం బ్రద్దలైపోయింది. ఆమెలోని మాతృత్వం గట్లుతెంచుకొని వరదలా ప్రవహించింది. ఆ మాతృప్రేమ పిల్లవాడిని కొట్టిన రాధపై విషం క్రక్కించింది.

ఆమె ఒక్కగంతులో ఉయ్యాల దగ్గరకు వెళ్లి కళ్ళతో నిప్పులు కక్కుతూ, రాధ చేయి పుచ్చుకొని ఇవతలకి లాగి-

"ఏం పని చేశారు రాధమ్మగోరూ! నోరులేని ఈ గ్రుడ్డునా మీరు కొడుతూంట? మీకు చేతకాకపోతే ఊరుకోండి, అంతేకాని నా బిడ్డని కొట్టకండి!" అంటూ బిడ్డని ఎత్తుకొని హృదయానికి హత్తుకొని, చకచకా సావిట్లోకి వచ్చేసింది.

రాధా, రామం ఒక్క క్షణం కొయ్యబారిపోయారు.

రాధ అభిమానం తీవ్రంగా దెబ్బతింది. తాను ఇన్నాళ్లూ చేసింది ఈ ఒక్కనాటితో పోయినట్లుగా భావించింది. అందులోనూ తన ఇంటి దాసి తనని లాగివేయడం తనకి భరింపరాని అవమానంగా తోచింది. ఆమె దెబ్బతిన్న అభిమానం కోపంగా రూపుదిద్దుకొని విషంగా మారింది. విసవిసా సావిట్లోకి వచ్చి అక్కడి దృశ్యం చూసేసరికి- ఆమె నిశ్చేష్టిత అయిపోయింది.

పిల్లవాడు ఏమీ ఎరగనట్లు, ఏమీ జరగనట్లు, నిశ్చింతగా వెంకాయి వద్ద పాలు తాగుతున్నాడు. వెంకాయి ముఖంలో చూద్దామన్నా కోపం లేదు. అనిర్వచనీయమైన ఆనందం, ప్రేమ తాండవిస్తున్నాయి.

ఆమె మాటిమాటికీ "నా బాబూ... నా తండ్రీ... ఎంత దెబ్బతిన్నావు నాయనా... ఎందుకు ఏడవాలి చెప్పు..." అంటూ బాబుపై ముద్దుల వర్షం కురిపించేస్తోంది.

ఆ దృశ్యం చూసేసరికి నిశ్చేష్టిత అయిన రాధ- తెప్పరిల్లుకొని, తీవ్రమైన కోపంతో-

"వెంకాయి... ఏమిటే నువ్వు చేసేది? నాకంటే నీవు పిల్లవాడికి దగ్గరిదానవా? పైగా నన్నే ఎదిరిస్తావా? ఆపైన ఛీ..ఛీ... నీ పాలు కూడా ఇస్తావా వాడికి? నీ హద్దులో నువ్వుండు! తే ముందు పిల్లాడిని!" అంటూ గదమాయించింది.

ఈ గోల విని శాంతమ్మగారు వంటగదిలోంచి గరిటె చేతిలో ఉంచుకునే- "ఏమిటే... ఆ గోల!" అంటూ సావిట్లోకి వచ్చింది.

ఆవిడ వస్తూండడం చూడగానే రాధ- "చూడండి అత్తయ్యా... ఈ వెంకిముండ నా గదిలోకి జొరబడి నన్ను నానామాటలూ అని, బాబుని తీసుకొని- పైగా పాలు కూడా ఇస్తోంది!" అంది రోషంగా.

వెంకాయి బాబుకి పాలిస్తూ ఉండిన దృశ్యం అప్పుడే చూసి కొయ్యబారిన శాంతమ్మగారు రాధ కేకలతో మళ్లీ ఈ లోకంలోకి వచ్చింది. ఆమెకు వెంకాయి బాబుకి పాలివ్వడం గంగవెర్రులెత్తించింది. ఆపుకోలేని కోపంతో- "పాడుముండా... ఎంత సాహసమే నీకు? నా మనవడికి నీ పాలిచ్చి వాణ్ణి కులభ్రష్టుడిని చేస్తావుటే?! తిన్నింటి వాసాలు లెక్కపెట్టినట్లు నీకు ఇదేమి పెడబుద్ధే? ముందు వాణ్ణి ఇలా ఇవ్వు!" అని అరిచింది.

వెంకాయి ఎంతో శాంతంతో- "లేదండి అమ్మగారూ... రాధమ్మగారు- బిడ్డడు ఏడుస్తుంటే ఓదార్చకపోగా కొట్టిందమ్మా! అది చూడలేక ఇలా చేశాను. తప్పు అయితే క్షమించండి అమ్మా!" అంది దీనంగా,

"చూశారా అత్తయ్యా! నాకు ఆమాత్రం తెలీదా? పిల్లవాడు ఏడ్చి విసిగిస్తుంటే ఓ దెబ్బ వేశానే అనుకోండి- నాకు తెలీదా ఎంత దెబ్బ వేయాలో? ఆమాత్రపు స్వతంత్రం నాకు లేదా? అయినా మన గోల దీనికెందుకంట? పైగా... పాలు కూడా పడుతోంది... ఛీ.. ఛీ!" అంది రాధ.

'పాలు' అన్నమాట వినగానే శాంతమ్మగారికి మళ్లీ శివం ఎత్తింది. "మా ఇష్టం! మా బిడ్డని మేం కొట్టుకుంటాం, చంపుకుంటాం! నువ్వెవరివి అడగడానికి? నువ్వేమయినా

కన్నతల్లివా, పెంచిన తల్లివా? వాడికి పాలు ఇవ్వడానికి నీకు ఎవరిచ్చారే హక్కు?" అంది- నమలకుండా మ్రింగేద్దామన్నంత కోపంతో.

ఎంతో బాధపడిన మనస్సుతో వెంకాయి, "అదేంటి అమ్మగారూ... అలాగంటారు? కాంతమ్మగారిని నా బిడ్డలాగా చూసుకున్నాను. ఆమె బిడ్డడు నాకు పరాయివాడు అవుతాడా? ఆ తల్లిలేని బిడ్డడంటే ఎందుకమ్మా అంత కసి? నిజం చెప్పండమ్మా- ఒక్కరైనా ఆ బిడ్డడ్ని ఆపేక్షగా చూస్తున్నారా? 'ఎందుకొచ్చిన ఖర్మరా...' అంటూ తిట్లతోనే పెంచుతున్నారు కాని, నోరులేని గుడ్డుని చావకొడుతూంటే చూస్తూ ఊరుకోడానికి నాది తల్లిప్రాణం కాని, నల్లరాయి కాదమ్మా! ఆ బిడ్డని మీకు పెంచడం కష్టమయితే నాకిచ్చేయండి- పువ్వుల్లో పెట్టి పెంచుకుంటాను!" అంది- దెబ్బతిన్న హృదయంతో, కళ్ళనీళ్లు తుడుచుకుంటూ.

"ఎంత మాటన్నావే..? నా మనవణ్ని నీకు పెంపకమియ్యాలా? మేమంతా చచ్చామను కున్నావా? ఇచ్చి ఇచ్చి ఛీ..ఛీ..! చివరకి నీకా మా బిడ్డని పెంపకమివ్వడం? ఇటువంటి కూతలు కూయడానికి నీకు నోరెట్లా వచ్చిందే?! ఔరా..?!! నీ మనస్సులో ఇంత కుచ్చితం దాగివుందా? చూస్తూంటే మా బిడ్డని కాజేసినా కాజేస్తావు! హమ్మా... ఎంత ద్రోహం?! ఇదిగో... చెబుతున్నాను- ఈ క్షణం నుంచీ నీవు మా యింట్లో పనికి రానక్కరలేదు!" అని, రాధతో- "దానికి రావలసిన దబ్బు దాని ముఖాన కొట్టవే! దాని ముఖం మళ్లీ మనకు చూపెట్టనక్కరలేదని చెప్పు!" అంది.

ఎప్పుడైతే పనిలోకి రావద్దని శాంతమ్మగారు ఖండితంగా చెప్పిందో- అప్పుడే వెంకాయి నెత్తిన పిడుగు పడినట్లయింది. పిల్లవాడితో కలిగే ఎడబాటు తలచుకొంటే- ఆమెకు భావిశూన్యంగా కనిపించింది. ఆ బిడ్డను చూసుకొని కడుపు శోకం మరచిపోతున్న తనకు- ఎడతెగని దుఃఖమే చివరికి మిగిలేదిగా తోచింది. ఆ బిడ్డడు లేని బ్రతుకు వృథా అనిపించింది. వెంటనే అమాంతం శాంతమ్మగారి కాళ్లమీద పడి-

"అంతమాట అనకండమ్మా! మీ ఉప్పు తింటూ మీకు ద్రోహం చేస్తానా? నా పని తీసివేయకండమ్మా! కావాల్సొస్తే బాబుకి ఇంకెప్పుడూ పాలివ్వను. నన్ను మాత్రం వెళ్లిపోమనకండమ్మా! దయచూడండి అమ్మా..!" అంటూ వెక్కివెక్కి ఏడ్చింది.

అయినా... దురభిమానంలో నిండిపోయిన శాంతమ్మగారి మనస్సు కరగలేదు.

"ఏమైనా సరే... పనిలోకి రావటానికి వీలులేదు!" అని ఖండితంగా చెప్పింది ఆవిడ.

వెంకాయి ఎంత బ్రతిమిలాడినా ఫలితం లేకపోయింది. చివరికి గత్యంతరం లేక ఆ అభాగ్యజీవి భారంగా నడుచుకుంటూ చీకట్లో కలసిపోయింది.

●

నాలుగు రోజులు గడిచాయి.

అక్కడ వెంకాయి కంటికీ, మంటికీ ఏకధారగా ఏడుస్తూ నిద్రాహారాలు మాని, పిల్లవాడి పైనే బెంగపెట్టుకొంది.

ఈ నాలుగు రోజులలో రెండుసార్లు వెంకాయి మొగుడు శాంతమ్మగారి దగ్గరకు వచ్చి, వెంకాయి స్థితి దీనంగా చెప్పి, మళ్ళీ వెంకాయిని పనిలోకి పెట్టుకోమని ప్రాధేయపూర్వకంగా అడిగాడు.

కాని, శాంతమ్మగారు ససేమిరా ఒప్పుకోలేదు.

అదేమి చిత్రమో, అదేమి చిత్రమో... అదేనాటి అనుబంధమో కాని– పిల్లవాడి పరిస్థితి మరీ విషమంగా తయారయ్యింది. వెంకాయి వెళ్ళిననాటి నుంచే పిల్లవాడికి ఒంట్లో నలతగా ఉండడం ప్రారంభమైంది.

రెండురోజులకి అది జ్వరంగా పరిణమించింది. చీటికీమాటికీ ఏడుస్తూండడం మొదలుపెట్టాడు. రామం పరిస్థితి అంతా చూసి, మళ్ళీ వెంకాయిని పనిలోకి పెట్టుకొంటే బాగుంటుందని తల్లికి చెప్పి చూశాడు. కాని, దురభిమానం అతిశయించిన శాంతమ్మగారు అందుకు సుతారమూ ఒప్పుకోలేదు. పైగా... రెండు రోజులలో జ్వరం అదే తగ్గుతుందనీ, ఈమాత్రం దానికి, రక్తబంధువుల కంటే, పరాయి శూద్ర స్త్రీ చేసేది ఏమీలేదనీ కోప్పడింది.

తల్లి సంగతి తెలిసిన రామం మళ్ళీ ఆ విషయం ఎత్తలేదు.

శాంతమ్మగారు బింకానికి పైకి ఎన్ని మాటలు అన్నా– ఆమె అంతరాత్మ ఆమె చేసేది తప్పని ఘోషిస్తూనే ఉంది. అయినా ఆమె దురభిమానానికి– అంతరాత్మ సలహా పాటించే సహనం లేకపోయింది.

రాధకి ఆనాడు జరిగిన విషయం మరిచిపోదామన్నా మరపుకి రావడంలేదు. పైగా ఆ పసికందు– తాను ఎంత లాలించినా ఏడుపు ఆపని ఆ అర్భకుడు– కేవలం పనిమనిషి ఎత్తుకునేసరికి ఊరుకోవడం... తనకి తీరని అవమానంగా భావించింది ఆ ఇల్లాలు. పైగా... అసలే ఓర్పు కోల్పోయిన ఆమెకు– ఈ జ్వరం వచ్చిన పిల్లవాడికి సేవ చేయడం ఇష్టంలేకపోయింది. అందుచేత తప్పనిసరి అయితే తప్ప అటువెళ్ళటం కూడా మానేసింది.

శాస్త్రిగారికి జరిగిన విషయాలు చూచాయగా తెలిసినా- వాటిని ఆ వేదాంతి అంతగా పట్టించుకోలేదు. కాని, ఆరోజు రామం చేసేదిలేక తండ్రి దగ్గరకు వచ్చి జరిగినదంతా వివరంగా తెలిపి, పరిస్థితి ఎంత విషమంగా ఉందో చెప్పాక- ఆయన మళ్లీ ఈ లోకంలోకి వచ్చారు. పైగా... ఆరోజు చీటికీమాటికీ పిల్లవాడు ఏడవడం గమనించాడు. కాంతం ఈ లోకంలో వదిలిన చివరి గుర్తు అయిన ఆ బిడ్డకు అన్యాయం చేయడం- ఆయనకు క్షమించరానిదిగా కన్పించింది. వెంటనే రామాన్ని వెళ్లి డాక్టరుని తీసుకురమ్మన్నాడు.

డాక్టరుగారు వచ్చి చూసి, "మరేమీ భయం లేదు" అని చెప్పి మందిచ్చి, సావిట్లోకి వచ్చి శాస్త్రిగారితో- కేసు కొంచెం సీరియస్సేననీ, అయినా భయంలేదనీ చెప్పి వెళ్లాడు. మందు వేశాక పిల్లవాడి ఏడుపు తగ్గింది.

ఆ సాయంత్రం పోతరాజు వచ్చి వెంకాయి పరిస్థితి ఏమీ బాగాలేదనీ, జ్వరతీవ్రతతో "బాబూ..." అని పలువరిస్తోందనీ, ఒక్కసారి బాబుని చూపించమనీ ప్రాధేయపడ్డాడు.

అయినా... శాంతమ్మగారి అహంకారం అందుకు సమ్మతించలేదు. ఆ విధికృత మాతాశిశువుల అన్యోన్యం ఆమె అర్థంచేసుకోలేకపోయింది. చేసేదిలేక పోతురాజు ఏడుస్తూ వెళ్లిపోయాడు.

జరిగింది అంతా వీధి గదిలోంచి చూశారు శాస్త్రిగారు. ఆయన హృదయం కరిగిపోయింది. వెంటనే పిల్లవాడిని తీసుకొని వెంకాయికి చూపిద్దామనుకున్నారు. కాని, పిల్లవాడి జ్వరం సంగతి జ్ఞాపకం వచ్చి ఆ ప్రయత్నం అప్పటికి విరమించుకున్నారు.

ఆరాత్రి పిల్లవాడి పరిస్థితి మరీ విషమించింది.

డాక్టరుగారు చూసి పెదవి విరిచారు. తాను ఇక చేయగలిగింది ఏమీలేదనీ, భగవంతునిపై భారంవేసి ఉండమనీ చెప్పి వెళ్లిపోయారు. శాంతమ్మగారి మనస్సు ఎందుకో భయంతో వణికిపోయింది. రాధ హృదయంలో ఎవరో చేయిపెట్టి కెలికినట్లయింది. ఆ దుష్పరిణామానికి కారణం తామేనేమోనని వారు భయపడిపోయారు. అయినా ఎవరు మాత్రం ఏమి చేయగలరు?

నిశ్చేష్టుడుగా ఉన్న శాస్త్రిగారి ముఖంలో ఒకవిధమైన కాంతి గోచరించింది. ఆయన వెంటనే ఉయ్యాల దగ్గరకు వెళ్లి రెండుచేతులతో బిడ్డను తీసుకున్నారు. ఆ పసివాడిని గుడ్డతో కప్పి బయటకు తీసుకుపోయారు.

ఆయన చేసేది ఏమిటో అర్థంకాని శాంతమ్మగారు- "ఎక్కడికండీ..?" అని వేసిన కేక ఆయనకి వినిపించలేదు. చకచకా నడుస్తూ చీకటిలో కలసిపోయారు ఆయన.

●

దూరాన ఒక గుడిసెలో దీపం మిణుకుమిణుకుమంటోంది.

ఆ చీకటిలో గుర్తుతెలియని ఆకారాలు ఇంట్లోనుంచి బయటకూ, బయటినుంచి ఇంట్లోకీ వస్తున్నాయి, పోతున్నాయి. చుట్టూ కీచురాళ్లు "గీఁ..." మని అరుస్తున్నాయి. దూరాన నక్కల కూతలు అస్పష్టంగా వినిపిస్తున్నాయి.

ఆ గుడిసెలోకి "పోతురాజూ..." అంటూ ప్రవేశించారు శాస్త్రిగారు.

"బాబుగారూ... మీరా?" అంటూ లేచినిలబడినాడు.

ఎదురుగా ఉన్న దృశ్యం చూసేసరికి కొయ్యబారిపోయారు శాస్త్రిగారు.

మంచం మీద గుర్తుపట్టలేకుండా ఉంది వెంకాయి. మనిషి సగానికి సగం అయిపోయింది. జుట్టు చిందరవందరగా రేగి ఉంది. శూన్యంలోకి ఏమిటో పిచ్చిచూపులు చూస్తోంది. ఎందుకో తనలో తనే ఏడుస్తోంది.

శాస్త్రిగారిని చూసి, గుడిసెలో ఉన్న పొరుగిళ్లవాళ్ళు బయటకు వెళ్లిపోయారు.

"ఎంకి ఎల్లిపోతోంది బాబూ... ఇంక అది నాకు దక్కదు... ఆచార్లుగారు కూడా లాభం లేదని చెప్పారు!" అని బావురుమన్నాడు పోతురాజు.

"వెంకాయి... బాబుని తెచ్చాను నీకోసం!" అని ప్రక్కన పడుకోబెట్టారు శాస్త్రిగారు.

అయినా వెంకాయిలో చలనం లేదు. ఏమీ పాలుపోక ఒకరి ముఖంలోకి ఒకరు ఆవేదనతో చూసుకున్నారు శాస్త్రిగారు, పోతురాజు.

ఇంతలో...

మగతగా ఉన్న పిల్లవాడు ఒక్కసారి బిగ్గరగా ఏడుపు మొదలుపెట్టాడు.

ఏ లోకంలోనో విహరిస్తున్న వెంకాయి- "బాబూ..." అంటూ పిల్లవాడిని చూసి హృదయానికి హత్తుకుంది. స్తన్యం కోసం తడుముకొంటున్న ఆ పసికూనకి ఆప్యాయంగా స్తన్యం అర్పించింది.

ఆ క్షణంలో ఆ ఇద్దరు జీవుల ముఖాలలో అవ్యక్తానందం, అనిర్వచనీయమైన శాంతి తాండవించాయి.

"దండాలు బాబూ..." అంది నీరసంగా వెంకాయి- శాస్త్రిగారిని చూసి.

"యెంకీ..." అంటూ దగ్గరకొచ్చాడు పోతురాజు సంతోషంతో.

"వెంకాయి! ఈనాటి నుంచీ ఆ బిడ్డ నీ బిడ్డ! మీ ఇద్దరినీ ఇంకెవ్వరూ వేరు చేయలేరు!" అంటూ గాద్గదికంగా అన్నారు శాస్త్రిగారు. ఆయన కళ్ళలోంచి అశ్రువులు జారాయి.

పాపాయిని ఆప్యాయంగా హృదయానికి హత్తుకుంటూ... కృతజ్ఞతాపూర్వకంగా శాస్త్రిగారి వైపు చూసి, భర్తవంక తిరిగి ఆప్యాయంగా చిరునవ్వు నవ్వుతూ కళ్ళు మూసుకుంది వెంకాయి.

మాతృత్వం వ్యాధిని జయించింది. ఆమె ముఖంలో అనిర్వచనీయమైన ప్రశాంతత తాండవిస్తోంది. ఆ ఆనందం, ఆ శాంతి మళ్ళీ దొరకవేమో... అన్నట్లు- దక్కినవి మళ్ళీ పోనీయకూడదో అన్నట్లు- ఆ మాతాశిశువులు ఒకరి కౌగిలిలో ఒకరు అలాగే ఉండిపోయారు. ఆ కౌగిలి నుంచి తిరిగి విడిపోనే లేదు. ఆ ఆనంద సమాధిలో వారు శాశ్వతంగా కన్నుమూశారు.

కొడిగట్టిన దీపం వెల్తురులో కూడా వారి ముఖంలోని ఆనందం, ప్రశాంతత మాత్రం ప్రస్ఫుటంగా కన్పిస్తూనే ఉన్నాయి... దూరాన గుడిగంటలు వినిపిస్తున్నాయి.

"ఎంకే..." అంటూ కూలబడ్డాడు పోతురాజు.

అప్రయత్నంగా రెండుచేతులూ ఎత్తి దణ్ణంపెట్టారు శాస్త్రిగారు. అశ్రుపూరిత నయనాలతో భారంగా అడుగులు వేస్తూ బయటకు వచ్చి చీకట్లో కలసిపోయారు.

అది ఏనాటి ఋణానుబంధమో?!

వారు ఏ జన్మలోనో శాపగ్రస్తులై విడివడిన మాతాశిశువులు కాబోలు!

ఏ జన్మలోనైనా, ఏ ప్రాణికైనా మాతృహృదయాన్ని గ్రహించే నేర్పు శిశువులకే ఉంది. అమృతతుల్యమైన మాతృత్వాన్ని అందిచ్చి మోడులకైనా చిగిరించే శక్తి మాతలకే ఉంది. మాతృత్వం శాశ్వతమైనది. అది ఆదిశక్తి! శాశ్వతత్త్వం భగవల్లక్షణం. శిశువులు సాక్షాత్పరబ్రహ్మ స్వరూపులు. అందుకే మాతృత్వం మూర్తీభవించిన ఆ మాత- అభం శుభం ఎరుగని ఆ శిశువు... శాశ్వతంగా భగవదైక్యం చెందారు.

అందుకే ఘోషించాయి ఉపనిశక్తులు... 'మాతృదేవో భవ!' అని.

*'చుక్కాని' పత్రిక . . . 15 జనవరి, 1962*